# సాక్షి వికారాబాద్

బుధవారం । 17 । జనవరి । 2024






## అగ్రి'కల్చర్' కనుమరుగు

వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పుల కారణంగా సేంద్రియ పద్ధతులకు మంగళం పలుకుతున్నారు. 8లో▸



## పెట్రోల్ పోసి.. నిప్పంటించి

గుర్తు తెలియని మహిళను దుండగులు హత్య చేసి ఆపై పెట్రోల్ పోసి నిప్పంటించి అతిదారుణంగా హత్య చేశారు. 8లో▸



## స్కూళ్లకు రక్షణ కరువు

సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు అంటూ పాలకులు చెప్పే మాటలకు క్షేత్రస్థాయిలో ఎనలేని వ్యత్యాసం ఉంటోంది. 9లో▸

## న్యూస్‌రీల్

### నియామకం



రాకేష్

**బంట్వారం:** తెలంగాణ వీరశైవ లింగాయత్ లింగబలిజ యూత్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం పట్లూర్‌కి చెందిన చాట్ల రాకేష్ నియమితులయ్యారు. సోమవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో సంఘం పెద్దల చేత ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం బంట్వారంలో రాకేష్ మాట్లాడారు. సంఘం పెద్దలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. లింగబలిజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. తనకు పదవి అప్పగించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్, గౌరవ అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్పకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### క్రీడా స్ఫూర్తితో సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి చరమందరాజు

**ఆమనగల్లు:** యువత క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని విజిలెన్స్ సీఐ గజ్జె చరమందరాజు అన్నారు. ఆమనగల్లు ప్రీమియర్ లీగ్ పేరుతో పట్టణంలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు పిలుపునిచ్చారు. మొదటి బహుమతి సాధించిన జీకే వారియర్స్ జట్టుకు షీల్డ్‌తో పాటు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాపిశెట్టి రాము, గుమ్మకొండ రాజు, కృష్ణనాయక్ పాల్గొన్నారు.

### బెదిరించి డబ్బులు లాక్కున్న నలుగురికి రిమాండ్

**అబ్దుల్లాపూర్‌మెట్:** ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వ్యక్తులను అడ్డగించి, డబ్బులు లాక్కుంటున్న నలుగురు సభ్యులున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేటలో నివాసం ఉండే సావల్‌రాం ఔటర్ సమీపంలోని తన పాన్‌షాప్‌ను బంద్ చేసి.. ఈ నెల 13న రాత్రి 11గంటల సమయంలో ఇంటికి వెళ్తున్నాడు. తారా కన్వెన్షన్ వద్దకు చేరుకోగానే నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు సావల్‌రాం అడ్డగించారు. అతన్ని బెదిరించి రూ.8 వేలు లాక్కుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను పట్టుకున్నారు. వీరిలో పెద్దఅంబర్‌పేట కళానగర్‌కు చెందిన ఆలేటి దుర్గాప్రసాద్, సిరిగిరి మధు, గగనం రవీందర్, మోతె శ్రీనివాస్ ఉన్నట్లు గుర్తించి, న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చారు. అనంతరం నలుగురినీ రిమాండ్‌కు తరలించారు.

### 'సంక్షేమం'తోనే అభివృద్ధి

**కడ్తాల్:** దేశంలోని అర్హులైన ప్రతీ పౌరుడికి సంక్షేమ పథకాలు అందినప్పుడే అసలైన అభివృద్ధి జరుగుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రధాన మంత్రి జనజాతి న్యాయ్ మహా అభియాన్(పీఎం జన్‌మన్) పథకంలబ్ధిదారులైన ఆదివాసీలతో సోమవారం ఆయన ఢిల్లీ నుంచి వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా కడ్తాల్ గిరిజన సంక్షేమ వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, కడ్తాల్, ఆమనగల్లు మండలాలకు చెందిన 11 గ్రామాల చెంచు ప్రజలు పాల్గొన్నారు.

**సంక్రాంతి కానుకగా రూ.540 కోట్లు**

దేశంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల ఆదివాసీల సంక్షేమానికి, సంక్రాంతి కానుకగా పీఎం జన్‌మన్ పథకం కింద లక్ష మందికి ప్రయోజనం చేకూర్చేలా ప్రధాని మోదీ (రూరల్ డెవలప్‌మెంట్ స్కీం కింద) తొలి విడతగా రూ.540 కోట్లు విడుదల చేశారు. అనంతరం ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఏపీ, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన లబ్ధిదారులతో మాట్లాడారు. వారి జీవన శైలి, కుటుంబ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. గడిచిన పదేళ్లలో ఆదివాసీలకు ఇస్తున్న సంక్షేమ పథకాల మొత్తాన్ని పది రెట్లకు పెంచామని తెలిపారు. ఆదివాసీల అభ్యున్నతికి కేంద్రం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం జన్‌మన్ లబ్ధిదారులకు ఉన్నతాధికారులు పథకం కార్డులను అందజేశారు. కార్యక్రమంలో కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ సుశీల్ విమల్, గురుకుల కార్యదర్శి నవీన్, కలెక్టర్ శశాంక, డీఆర్‌డీఓ ప్రభాకర్‌రావు, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, డీటీడీఓ రామేశ్వరీదేవి, ఆర్డీఓ సూరజ్ కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కొన్నది కొంతే



గోదాంకు తరలిస్తున్న ధాన్యం బస్తాలు

ధాన్యం సేకరణలో అధికారుల కొర్రీలు

- తేమ, తాలు పేరుతో రైతులను తిప్పిపంపిస్తున్న వైనం
- ఇప్పటివరకు 20శాతం మాత్రమే కొనుగోలు
- దళారులను ఆశ్రయిస్తున్న మెజార్టీ రైతులు

**వికారాబాద్:** ఓ పక్క కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల కొర్రీలు.. మరో పక్క ధాన్యం డబ్బులు నిర్ణీత సమయంలో ఖాతాల్లో పడకపోవటం తదితర కారణాలతో రైతన్నకు తిప్పలు తప్పడంలేదు. తేమ, తాలు పేరుతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులను పదేపదే తిప్పి పంపుతుండటంతో చేసేదిలేక ధాన్యం కల్లాల్లోనే పెట్టుకుని పడిగాపులు గాస్తున్నారు. ఏంచేయాలో తెలియని స్థితితో దళారులకు తక్కువ రేటుకే ధాన్యం విక్రయించి నష్టాలపాలవుతున్నారు. అధికారులు మిల్లర్లతో కుమ్మక్కయ్యారనే విమర్శలు కూడా ఉన్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు కేవలం 20 శాతం మాత్రమే ధ్యాన్యం సేకరించారంటే పరిస్థితి ఇట్టే అర్థమవుతోంది.

**జిల్లాలో 120 కొనుగోలు కేంద్రాలు**

యాసంగి సీజన్‌తో పోలిస్తే ఖరీఫ్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల సంఖ్యను భారీగా తగ్గించారు. జిల్లాలో 120 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో 104 కేంద్రాల్లోనే కొనుగోళ్లు జరిపారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 1.30లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగుచేయగా ఎకరానికి సగటున 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈలెక్కన జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ చెబుతోంది. అయితే ఇందులో సీడ్ వరి తదితర ధాన్యం పోను కొనుగోలు కేంద్రాలకు 2.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉంది. ఇందులో భాగంగా ఇప్పటివరకు కేవలం 42,655 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అంటే 20శాతానికి మించి ధాన్యాన్ని కొనుగోలు చేయలేకపోయారు. అంటే దాదాపు జిల్లాలో రైతులు పండించిన దాంట్లో 85 శాతం ధాన్యం దళారులకే విక్రయించారనేది స్పష్టమవుతోంది.

**తేమ, తాలు పేరుతో ఇబ్బంది**



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తేమ, తాలు పేరుతో ఇబ్బందులు పెడుతున్నారు. అయినప్పటికీ పలువురు రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించగా ఇప్పటికీ డబ్బులు రాలేదు. దీంతో బయట మార్కెట్‌లో ధాన్యం విక్రయించాల్సిన పరిస్థితి. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి.

– బాబు, రైతు, బొంపల్లి

**అధికారుల కొర్రీలు**

జిల్లాలోని 70 మిల్లర్ల ద్వారా మిల్లింగ్ ప్రక్రియ చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర (క్వింటాల్‌కు రూ.2203) చెల్లించి ధాన్యం తామే కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఆదిశగా జిల్లా అధికారులు కసరత్తు చేశారు. ఏ–గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2203 చెల్లిస్తుండగా బీ–గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2183 చెల్లిస్తున్నారు. అయితే కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులు తేమ, తరుగు పేరుతో కొర్రీలు పెడుతుండటంతో దళారులకు క్వింటాల్ రూ.1800కే విక్రయిస్తున్నారు.





సీతారాములవారి ముగ్గు, (ఇన్‌సెట్‌లో) ముగ్గువేస్తున్న విజయలక్ష్మి

## సీతారాముల ముగ్గు

త్వరలో అయోధ్యలో రామ మందిరం ప్రారంభాన్ని పురస్కరించుకొని మంగళవారం తాండూరు పట్టణ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి ఆమె ఇంటి ఎదుట శ్రీ సీతారాములవారి ముఖచిత్రాలతో ముగ్గు వేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ ముగ్గు వేసినట్లు ఆమె తెలిపారు. సీతారాములవారి ముగ్గు ఆకట్టుకుంటోంది.

– తాండూరు టౌన్

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

**చేవెళ్ల/మొయినాబాద్:** ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఎస్టీఎఫ్ నా యకులు విన్నవించారు. మంగళవా రం వారు సెక్రెటేరియట్‌లో భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యు.పోచయ్య, ప్రధాన కార్యదర్శి డి.సైదులు, జిల్లా అధ్యక్షుడు జనార్ధనాచారి, ప్రధాన కార్యదర్శి గోపాల్, చేవెళ్ల మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శులు రాంచంద్రయ్య, రమేశ్, సుధాకర్, శ్రీనివాస్, సంతోశ్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ ఆటో వద్ద గుమిగూడిన వినియోగదారులు

# పండుగ పూట.. గ్యాస్ గోస

- బుక్ చేసి పది రోజులైనా డెలివరీ కాని సిలిండర్
- సాంకేతిక కారణాలతోనే అని డీలర్ సాకులు
- హోటళ్లు, వ్యాపార సంస్థలకు పక్కాగా పంపిణీ
- చర్యలు తీసుకోవాలంటున్న వినియోగదారులు

**వికారాబాద్ అర్బన్:** వికారాబాద్ పట్టణ ప్రజలు పండగపూట వంటగ్యాస్ సిలిండర్ కోసం ఇబ్బంది పడ్డారు. పండుగ ముందు బుక్‌చేసిన వారికి సాంకేతిక కారణాల చేత గ్యాస్ సరఫరా చేయలేకపోయామని డీలర్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు పదిహేను రోజులుగా వంటగ్యాస్ సరఫరా సక్రమంగా కావడం లేదు. దీంతో సంక్రాంతి పండుగకు 2–3 రోజులు ఉందన్నపటి నుంచి వినియోగదారులు గ్యాస్ గోదాం వద్దకు వెళ్లి అర్ధరాత్రి వరకు క్యూలైన్‌లో ఉండి గ్యాస్ సిలిండర్ తీసుకువస్తున్నారు. అయితే గంటల తరబడి క్యూలైన్‌లో ఉన్నప్పటికీ చాలా మందికి గ్యాస్ దొరకలేదు. ఇదేంటని డీలర్‌ను ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిచయస్తులకు, అధికారులకు, నాయకులకు మాత్రమే గ్యాస్ సరఫరా చేసి సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. గ్యాస్ బుక్ చేసి పదిరోజులు గడుస్తున్నా డెలివరీ ఇవ్వడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. గ్యాస్ సరఫరా చేయకుండానే డెలివరీ చేసినట్లు ఎస్ఎంఎస్‌లు కూడా వస్తున్నాయని వాపోతున్నారు. గ్యాస్ డెలివరీ బాయ్‌లు గ్యాస్ సరఫరా చేయకుండానే చేతివాటం ప్రదర్శిస్తూ బుక్ చేసుకోని వారికి, వారి యజమానులు చెప్పినవారికి గ్యాస్ సరఫరా చేస్తున్నారని గోదాం వద్ద వినియోగదారులు ఆందోళన చేపట్టారు. వంటగ్యాస్‌ను అధిక ధరలకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు, హోటళ్లకు సరఫరా చేస్తుండటంతోనే ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై పలుమార్లు డీలర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వినియోగదారులు అంటున్నారు. వికారాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు కూడా వంట గ్యాస్ సరఫరా చేసేందుకు ఒకే డీలర్ ఉండటంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే ఐదు రోజుల క్రితం అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మాట్లాడుతూ.. బుక్ చేసుకున్న ప్రతి ఒక్కరి ఇంటికి నిర్ణీత సమయంలో గ్యాస్ సరఫరా అవుతోందని చెప్పడం గమనార్హం. సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో గ్యాస్ సరఫరా అయ్యేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

# రూ.17 వేల కోట్లతో టూరిజం అభివృద్ధి

- పర్యాటక కేంద్రంగా అనంతగిరిగుట్ట
- కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి సహకరిస్తాం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ధారూరు: ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ధారూరు:** దేశంలో రూ.17 వేల కోట్లతో టూరిజం రంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టును సోమవారం ఆయన సందర్శించారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి బోటింగ్ చేశారు. టేకు ఆకులతో చేసిన ప్రత్యేక టోపీని ధరించి పర్యాటకులను ఉత్తేజపర్చారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో పర్యాటకరంగం వేగ వంతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ముఖ్యంగా డొమెస్టిక్ టూరిజాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. గత రెండేళ్లలో దాదాపు 170 దేశాల నుంచి పర్యాటకులు భారతదేశంలో పర్యటించారన్నారు. తెలంగాణలో ఇప్పటికే మహబూబ్‌నగర్‌లో ఎకో టూరిజం, వరంగల్‌లో ట్రైబల్ టూరిజం, రామప్ప దేవాలయానికి ప్రపంచ గుర్తింపు వంటి వాటికి కృషి చేశామన్నారు. పోచంపల్లి గ్రామాన్ని ప్రపంచ బెస్ట్ టూరిజంగా చేశామన్నారు. అడవి పచ్చదనం మధ్యలో ఉన్న అనంతగిరి గుట్టను టూరిజం హబ్‌గా చేయడానికి రూ.100 కోట్లు కేటాయించామన్నారు. దీనికి సంబంధించిన డీపీఆర్ ఫైనల్ స్టేజిలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి కూడా ఇచ్చిందన్నారు. వెంటనే టెండర్ పెడుతామన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ చేయడం చాలా మంచి అనుభూతిని కలిగించిందని అన్నారు.ప్రాజెక్టు అభివృద్ధికి సహకరిస్తామని అన్నారు. టూరిజం రంగంలో ప్రైవేట్ సెక్టార్‌ను ప్రోత్సహించి విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేకెఎంఆర్ బోటింగ్ కన్వీనర్ రాములు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సదానంద రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్ పాల్గొన్నారు.

**అనంతుని సేవలో కేంద్ర మంత్రి**

**అనంతగిరి:** వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంతగిరి గుట్ట శ్రీ అనంతపద్మనాభస్వామిని సోమ వారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దర్శించుకున్నారు. పెద్దముల్ మండలం చైతన్యనగర్‌లో నిర్వహించిన ప్రధానమంత్రి జన్‌మన్ మహా అభియాన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన ఆయన మార్గమధ్యలో అనంతగిరిగుట్టలో ఆగి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ నరేందర్, ధర్మకర్త పద్మనాభం.. కిషన్‌రెడ్డికి స్వామివారి ప్రతిమ అందజేసి ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధికి స్థలం కేటాయించాలని, నిధులు మంజూరు చేయాలని కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాధవరెడ్డి, శివరాజు, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

## చెంచు కుటుంబాల్లో నిజమైన సంక్రాంతి



చెంచులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

**పెద్దేముల్:** చెంచు కుటుంబాల్లో నిజమైన సంక్రాంతిని తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి జన్‌మన్' కార్యక్రమంతో చేయూతనందిస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలంలోని చైతన్య నగర్‌లో సోమవారం ఉదయం పీఎం జన్‌మన్‌లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగాన్ని కిషన్‌రెడ్డి.. రైతులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గిరిజన, చెంచు కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.24వేల కోట్లతో ప్రధానమంత్రి జన్‌మన్ మహా అభియాన్ పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ పథకంలో భాగంగా గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. గిరిజన తెగలకు చెందిన లక్ష కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 468 గ్రామాలను ప్రధానమంత్రి జన్‌మన్ మహా అభియాన్‌కు ఎంపిక చేయడం జరిగిందన్నారు. దీనిద్వారా దాదాపు 55వేల మంది గిరిజన చెంచులకు లబ్ధి చేకూరుతుందన్నారు. చెంచులు, గిరిజనుల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేకంగా జాబ్‌మేళాలను నిర్వహించి అర్హతను బట్టి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జెడ్పీటీసీ ధారాసింగ్, మండల ఎంపీపీ అనురాధ, వైస్ ఎంపీపీ మధులత, గ్రామ సర్పంచ్ లలిత, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

# సర్కారు భూములకు రక్షణ కరువు!



మొండిగౌరెల్లిలోని ప్రభుత్వ భూమిలో అధికారులు గుర్తించిన అక్రమ నిర్మాణం

- యాచారం మండలంలో రూ.కోట్లు విలువ చేసే స్థలాలు అన్యాక్రాంతం
- అడ్డుకోవడంలో రెవెన్యూ అధికారులు విఫలం

**యాచారం:** మండల పరిధిలోని ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. రూ.కోట్లు విలువ చేసే సర్కారు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. మహానగరానికి కూత వేటు దూరంలో ఉంది యాచారం మండల కేంద్రం. ఇక్కడి పలు గ్రామాల్లో భూముల ధర ఎకరాకు రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్లకు పైగానే పలుకుతోంది. పెద్ద పెద్ద కంపెనీల ఏర్పాటు, పలువురు ప్రముఖులు ఈ ప్రాంతంలోని వ్యవసాయ భూములు కొనుగోలు చేయడంతో డిమాండ్ బాగా పెరిగింది. ఇందులో భాగంగానే నందివనపర్తి, నస్దిక్‌సింగారం, చింతుల్ల, అయ్యవారిగూడ, యాచారం, మల్కీజ్‌గూడ తదితర గ్రామాల్లో వ్యవసాయ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. రేట్లు ఆకాశన్నంటడంతో అక్రమార్కుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. రికార్డుల్లో వందలాది ఎకరాలున్నట్లు కనిపిస్తుంది.. కానీ కబ్జా మాత్రం ఉండదు. మండలంలోని పలు గ్రామాల్లో రియల్ వ్యాపారులు వెంచర్లు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల ప్రభుత్వ భూముల పక్కనే వెంచర్లు ఏర్పాటు చేయడంతో పాటు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై ఆయాగ్రామాల్లోని పంచాయతీ సభల్లో ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారే లేకుండాపోయారు. రెవెన్యూ అధికారుల అండదండలతోనే.. ధరణి పోర్టల్ రాకముందు అక్రమార్కులు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి తమ పేర్లపై పట్టాదారు, పాసుపుస్తకాలు పొందారనే ఆరోపణలున్నాయి.

**కళ్లముందే కనిపిస్తున్నా..**

అయ్యవారిగూడెం, నస్దిక్‌సింగారంలో ప్రభుత్వ భూమి పక్కనే వెంచర్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు ప్రభుత్వ భూమిని అక్రమించారని గతంలో ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు అందాయి. మొండిగౌరెల్లి సర్వే నంబరు 68లో మొత్తం 788.20ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 203.16 ఎకరాలను పేదలకు అసైన్డ్ చేశారు. ప్రస్తుతం 585.04ఎకరాల మిగులు భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదైంది. కానీ క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తే భూమి లేదు. మిగులు భూమి ఆధారంగా అప్పట్లో 300 ఎకరాల్లో సెంట్రల్ జైలు ఏర్పాటు చేసేందుకు అధికారులు సర్వే చేయించారు. రికార్డుల్లో ప్రభుత్వ భూమి ఉండగా.. కబ్జాకు మాత్రం లేదని తేల్చారు. దీంతో జైలు నిర్మాణాన్ని రద్దు చేసుకున్నారు. సర్వే నంబరు 127లో అక్రమార్కులు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి ప్రభుత్వ భూమిని కాజేసినా.. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. నల్లవెల్లిలోని సర్వే నంబరు 45లో దాదాపు 30 ఎకరాలకు పైగా నకిలీ డాక్యుమెంట్లు కలిగినవేననే ఆరోపణలున్నాయి. అప్పట్లో వీరికి సహకరించిన ఓ రెవెన్యూ అధికారిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు.

**శాశ్వత కంచెలతో రక్షణ**

మహానగరానికి దగ్గర(40 కిలోమీటర్ల దూరం)లో సాగర్ రోడ్డుకు ఇరుపక్కలా యాచారం మండల కేంద్రం విస్తరించి ఉంది. మండలంలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్దలోని దాదాపు 4 వేల ఎకరాలకుపైగా ప్రభుత్వ, అసైన్డ్ భూమిని అప్పటి కేసీఆర్ సర్కార్ ఫార్మాసిటీ (ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సర్కార్ ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది)కి సేకరించింది. మొండిగౌరెల్లి, నల్లవెల్లి, చింతపట్ల, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, మంతన్‌గౌరెల్లి, మాల్ తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూమికి శాశ్వత కంచెలు ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తే ఆక్రమణలకు అవకాశం ఉండదు. నందివనపర్తి, నస్దిక్‌సింగారం, చింతపట్ల, మాల్, చింతుల్ల, కుర్మిద్ద, యాచారం, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో రియల్ వ్యాపారులు వందలాది ఎకరాల్లో వెంచర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, అటవీ భూములు, చెరువులు, కుంటల పక్కనే వెంచర్లు ఏర్పాటు చేసి కబ్జాలకు పాల్పడ్డారని ఫిర్యాదులు అందినా అధికారుల్లో స్పందన లేదు.

## క్లుప్తంగా

### చైనా మాంజాతో వ్యక్తికి గాయం


గాయపడిన అయ్యప్ప

అనంతగిరి: చైనా మాంజా కారణంగా ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన మంగళవారం వికారాబాద్‌ పట్టణంలో చోటు చేసుకుంది. బూర్గుపల్లికి చెందిన అయ్యప్ప తన బైక్‌పై ఎన్నెపల్లి నుంచి వికారాబాద్‌వైపు ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో రైల్వే బ్రిడ్జిపై వెళ్తుండగా ఒక్కసారిగా చైనా మాంజా దారం అతని కన్ను కింది భాగంలో తగిలి గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

### మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

వ్యక్తి బలవన్మరణం


నర్సింహులు మృతదేహం

ధారూరు: మద్యానికి డబ్బులు ఇవ్వకపోవడంతో పురుగుమందు సేవించి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని మోమిన్‌ఖుర్దులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌ కుమార్‌ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బంటు చిన్న నర్సింహులు(45) ఆదివారం ఎక్కువ మొత్తంలో మద్యం తాగాడు. ఇంటికి వచ్చి మద్యానికి డబ్బులు ఇవ్వాలని భార్య బాబమ్మను కోరాడు. దీంతో ఆమె డబ్బులు ఇచ్చేది లేదని ఖరాఖండిగా చెప్పింది. దీంతో కోపం పెంచుకున్న నర్సింహులు మద్యం మత్తులోనే క్రిమిసంహారక మందు తాగాడు. నోట్లోంచి నురగలు గక్కడంతో గమనించిన భార్య వెంటనే కుటుంబ సభ్యుల సహకారంతో 108 వాహనంలో వికారాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### 20న ఎమ్మెల్యే కూనంనేనికి అభినందన సభ

షాద్‌నగర్‌: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించినందుకుగాను ఈనెల 20న అభినందన సభ నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు తెలిపారు. మంగళవారం పట్టణంలోని దేవీ గ్రాండ్‌ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పర్వతాలు మాట్లాడుతూ... కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్‌ నుంచి పోటీ చేసిన సాంబశివరావు అఖండ విజయం సాధించారన్నారు. పట్టణంలోని మహబూబ్‌నగర్‌ రోడ్డులో ఉన్న వీ కన్వెన్షన్‌ హాల్‌లో ఉదయం 11గంటలకు అభినందన సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బుద్దుల జంగయ్య, శ్రీను పాల్గొన్నారు.

### చిక్కుకున్న గాలిపటాన్ని తీస్తూ..


వివేక్‌(ఫైల్‌)

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్‌ వైర్లకు చిక్కుకున్న గాలిపటాన్ని తీయడానికి ప్రయత్నిస్తూ.. కరెంట్‌ షాక్‌ తగిలి బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కాటేదాన్‌ గణేశ్‌నగర్‌ ప్రాంతానికి చెందిన సంతోశ్‌, స్రవంతి దంపతులకు వివేక్‌(9) కుమారుడు. రవి బ్రిలియంట్‌ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి రోజున గాలిపటం ఎగురువేసేందు ఇంటి పైకి వెళ్లాడు. అయితే, ఓ గాలిపటం విద్యుత్‌ హైటెన్షన్‌ వైర్లకు చిక్కుకొని ఉండటంతో ఇనుప చువ్వతో దాన్ని తీయడానికి వివేక్‌ యత్నించాడు. దీంతో కరెంటు షాక్‌ తగిలి కిందకు పడిపోయాడు. స్థానికులు వెంటనే బాలుడిని శివరాంపల్లిలోని శ్రీచంద్ర హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్టుడాక్టర్‌ ధ్రువీకరించారు. దీంతో గణేశ్‌నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. విద్యుత్‌ అసిస్టెంట్‌ డివిజనల్‌ ఇంజినీర్‌ ఈశ్వర్‌ ప్రసాద్‌ చేరుకొని ఘటన స్థలిలి పరిశీలించారు.

# అగ్రి‘కల్చర్‌’ కనుమరుగు

- అవగాహన కల్పించని వ్యవసాయాధికారులు
- రసాయనాల వాడకంతో ఆర్థిక ఇబ్బందులు
- కలుషితమవుతున్న పంటలు


వరి పంట సాగులో కానుగ కొమ్మలు వేసిన రైతులు

బొంరాస్‌పేట: అగ్రికల్చర్‌లో పాత సాగు సంస్కృతి కనుమరుగవుతోంది. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పుల కారణంగా సేంద్రియ పద్ధతులకు మంగళం పలుకుతున్నారు. సేంద్రియ పద్ధతులను పాటించే రైతులు దుర్భిణితో వెతికినా కనిపించడం లేదు.

**వ్యవసాయానికి వ్యసనంగా రసాయనం**

ఏళ్ల క్రితం చేపట్టిన వరి సాగులో కానుగ మండలు, ఎంపలి పారకను వాడేవారు. ప్రస్తుతం రసాయన ఎరువల తయారీ వాడకం ఎక్కువవ్వడంతో మార్కెట్‌లో పలు కంపెనీలు పోటీ పడి మరీ ఎరువులను రైతులకు దగ్గరకు చేశారు. ప్రస్తుతం సేంద్రియ ఎరువులు, పద్ధతులు తగ్గి రసాయనం వ్యవసాయంలో వ్యసనంగా మారిపోయింది. ఎరువుల వాడకంతో భూ సారం కోల్పోయి దిగుబడి తగ్గుతోంది. దీంతో రైతు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

**కానుగతో లాభాలు**

గతంలో వరి సాగు చేసే పొలంలో నాటు వేయక ముందు వారం రోజులకు ముందుగానే పొలంలో మండలను తొక్కేవారు. దీంతో పంటకు నైట్రోజన్‌ విరివిగా లభించేంది. ప్రస్తుతం దీని స్థానంలో యూరియా వాడడం పరిపాటైంది. కానుగ, ఎంపలి పారకల వల్ల పంట పొలం ఆరోగ్యవంతంగా ఉండి నేలలో మొక్కకు కావాల్సిన గాలి, ఆర్గానిక్‌ పదార్థాలను వేళ్ల ద్వారా మొక్కకు సమకూరుస్తాయని వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు. ఎకరానికి ఒక యూరియా బస్తాను ప్రస్తుతం వాడుతుండగా కానుగ మండల వాడకంతో ఖర్చు తగ్గడంతో పాటుగా పొలాలు సారవంతంగా ఉంటాయంటున్నారు. ఎకరా పొలంలో 30 మోపుల వరకు కానుగ సరిపడితుందని రైతులు వెల్లడిస్తున్నారు.

**తగ్గిన కానుగ పెంపకం**

మండల పరిధిలోని బొంరాస్‌పేట పెద్ద చెరువు కింద 600ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా పదెకరాల్లో కూడా కానుగ వాడకం లేదు. కానుగ చెట్ల పెంపకం కూగా ఘణనీయంగా తగ్గింది. కానుగ ఆవశ్యకత గురించి ఇప్పటి రైతులకు తెలిసినా వాడడం లేదని తెలుస్తోంది. ముందు తరాల రైతులకు సేంద్రియ పద్ధతులు తెలిపేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని వ్యవసాయానుభవజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. గతంలో మండలంలోని ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చౌదర్‌పల్లి, దుద్యాల, హంసాన్‌పల్లి, చెట్టుపల్లితండా, బురాన్‌పూర్‌, లింగన్‌పల్లి తదితర గ్రామాల్లో సేంద్రియ వ్యవసాయంపై ఉద్యమరూపంలో కార్యక్రమాలు చేశారు. తర్వాత ఎన్‌పీఎం వంటి కార్యక్రమాలతో స్వచ్ఛంద సంస్థలు అక్కడక్కడా ప్రత్యేక కార్యక్రమాలు చేసి వదిలేశారు. వాటిని నిరంతరంగా పాటించేలా బాధ్యత వహించాలంటున్నారు.

**పంటకు మేలు**



వరి పంట సాగులో కానుగ మొక్కలను వేయడం తండ్రి నుంచి అలవాటు ఉంది. మా కుటుంబంలో ఇప్పటికీ కానుగ వాడడం సంప్రదాయంగా మారింది. ఈ పొలంలో పండించిన బియ్యం రుచికరంగా ఉంటుంది. శ్రమ అనుకోకుంటే ఈ పద్ధతితో ఎంతో మేలు.

– బాలప్ప, రైతు, చిల్మల్‌మైలారం, దుద్యాల

**భూసారం పెరుగుతుంది**



సేంద్రియ పద్ధతులతో భూమికి, మనిషి ఆరోగ్యానికి మేలు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. తెలంగాణ సోనాను సేంద్రియ ఎరువులు వాడడం వల్ల భూమిలో సారవంతంతోపాటు లాభం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఆరోగ్యమైన పంటను పండించవచ్చు.

– మైనప్ప రైతు, రేగడిమైలారం, బొంరాస్‌పేట

# పెట్రోల్‌ పోసి.. నిప్పంటించి

మహిళ దారుణ హత్య


ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: గుర్తు తెలియని మహిళను దుండగులు హత్య చేసి ఆపై పెట్రోల్‌ పోసి నిప్పంటించి అతి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన వికారాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ టి.శ్రీను తెలిపిన ప్రకారం.. సోమవారం వికారాబాద్‌ మండలం పులుమద్ది సమీపంలోని శంకర్‌ అనే రైతు వ్యవసాయం పొలం సమీపంలో ఓ గుర్తు తెలియని మహిళను హత్య చేసి నిప్పంటించారని గ్రామస్తులు సర్పంచ్‌ మాధవరెడ్డికి తెలిపారు. ఆయన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మహిళ ముఖం పైదాడి చేసి చీర కొంగుతో మెడకు ఉచ్చు వేసి చంపి ఉంటారని.. ఆ తర్వాత మృతురాలిని గుర్తించకుండా నిప్పంటించారని ప్రాథమికంగా నిర్ధారించారు. మృతురాలి వయస్సు 30–35 ఏళ్ల మధ్య ఉంటుందని.. ఆమె ఒంటిపై ఆకుపచ్చ జాకెట్‌, గులాబీ రంగు పెట్టికోట్‌, లేత ఆకుపచ్చ చీరపై పసుపు, ఎరుపు రంగులో పూల డిజైన్‌ ఉందన్నారు. రెండు వైపులా ముక్కుపుడకలు గుర్తించారు. క్లూస్‌ టీం, జాగిలాలతో ఆధారాలు సేకరించారు . మృతురాలిని అత్యాచారం చేసి హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు చెబుతామని కేసు దర్యాప్తు చేపట్టామని చెప్పారు. ఈ ఘటన 14న రాత్రి జరిగి ఉండవచ్చునని భావిస్తున్నట్లు తెలిపారు. మృతురాలిని గుర్తించిన వారు 8712670030 ఫోన్‌ నంబర్‌లో సంప్రందించాలన్నారు.

**ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం: ఎస్పీ**

ఈ ఘటనా స్థలిని ఎస్పీ కోటిరెడ్డి మంగళవారం సాయంత్రం తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఘటన స్థలంలో దొరికిన ఆధారాలతో పాటుగా టెక్నికల్‌, సీసీ టీవీ, ఇతర సమాచారంతో మృతి చెందిన మహిళ ఆచూకీ కోసం వికారాబాద్‌ సబ్‌ డివిజన్‌ అధికారులు, సీసీఎస్‌, టెక్నికల్‌ టీం సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. సమాచారం తెలిసిన వారు పోలీసులకు చెప్పాలని.. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆయన వెంట ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీ నర్సింహులు, సీఐ టి.శ్రీను, ఆంజనేయులు, రవికుమార్‌, ఎస్‌ఐలున్నారు.

# వ్యక్తి అనుమానాస్పద మృతి

దోమ: ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన దోమ పీఎస్‌ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవిగౌడ్‌ తెలిపిన ప్రకారం.. కుల్కచర్ల మండలం పుట్టపహాడ్‌ గ్రామానికి చెందిన వడ్డే రామాంజనేయులు(38) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందింది. మృతుడు మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన తిరుమలమ్మ, రాములు దంపతుల కూతురు అలివేలును 15ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. రామాంజనేయులు అత్తింటి వద్దే ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 15న మేకల విషయంలో భార్య అలివేలు అత్తామామలు తిరుమలమ్మ, రాములు, బావమరిది నర్సింహులు గొడవ పడ్డారు. ఇదే విషయం మృతుడు తన తండ్రికి సోమవారం ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. మంగళవారం ఆయన చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడికి కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో మృతుడి తండ్రి కిష్టప్ప తన కొడుకును అత్తింటివారు దాడిచేసి చంపారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# మన సాంప్రదాయాలు ఆదర్శం

ఆర్‌ఎస్‌ఎస్‌ తెలంగాణ ప్రాంత ప్రచారక్‌ జి.రాంప్రసాద్‌

కొడంగల్‌ రూరల్‌: మన దేశ సంస్కృతి, సాంప్రదయాలను కాపాడుకునేందుకు ఆర్‌ఎస్‌ఎస్‌, హిందూవాహిని కార్యకర్తలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్‌ తెలంగాణ ప్రాంత ప్రచారక్‌ జి.రాంప్రసాద్‌ సూచించారు. సోమవారం పట్టణంలోని మహదేవుడి ఆలయ ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉత్సవ విశిష్టతను వివరించారు. ప్రపంచ దేశాలు మన సంస్కృతి, సాంప్రదాయాలను పాటిస్తున్నాయన్నారు. మన దేశంలో నివసించేవారికి దేశంపై ప్రేమ, గౌరవం, అభిమానం ఉండాలని సూచించారు. భారతీయ సనాతన ధర్మానికి అనుగుణంగా సృజనాత్మకతను పెంపొందించుకోవాలని చెప్పారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన రాముల వారి అక్షింతలను ప్రతీ ఇంటికీ పంచి వాటి విశిష్టతను వివరించడం కార్యకర్తలకు అదృష్టమన్నారు. అనంతరం నువ్వుల లడ్డూలను ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు జగన్మయానందస్వామి, ముఖ్య అతిథి విశ్రాంత ఉపాధ్యాయులు రాధాకృష్ణ, హిందూవాహిని, ఆర్‌ఎస్‌ఎస్‌ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిటీజన్‌ క్లబ్‌లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

రేపు బహుమతుల ప్రదానం

కొడంగల్‌: యువజన కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని సిటీజన్‌ క్లబ్‌లో నిర్వహిస్తున్న ఈ పోటీలు యువజన కాంగ్రెస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, తాలూకా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్‌ పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. రాష్ట్రస్థాయి పోటీలకు సీఐ రాములు ఆధ్వర్యంలో పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేశారు. పీఏసీఎస్‌ అధ్యక్షుడు శివకుమార్‌గుప్తా, సర్పంచ్‌లు రమేశ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు మహ్మద్‌ యూసుఫ్‌, కాంగ్రెస్‌ మండల కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్‌, మాజీ సర్పంచ్‌ సంజీవరెడ్డి, మిఠాయిరాజు తదితరులు కబడ్డీ పోటీలను ప్రారంభించారు. విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

### కేంద్రియ విశ్వవిద్యాలయం మంజూరు చేయండి

కేంద్ర మంత్రికి తాండూరు ఎమ్మెల్యే వినతి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: సరిహద్దులో ఉన్న తాండూరు ప్రాంతంలో విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు కేంద్రియ విశ్వ విద్యాలయాన్ని మంజూరు చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి వినతిపత్రం అందించారు. సోమవారం పెద్దేముల్‌ మండలం చైతన్యనగర్‌కు వచ్చిన మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తాండూరు వాణిజ్య కేంద్రంగా ఉందని అందుకు తగిన మౌలిక వసతులు లేవని సెంట్రల్‌ మంత్రికి వివరించారు. జాతీయ రహదారులను మన్నెగూడ నుంచి తాండూరు వరకు విస్తరించాలని కోరారు. తాండూరు నుంచి జహీరాబాద్‌ జాతీయ రహదారి వరకు రోడ్డు అనుసంధానం చేయాలన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే జాతీయ రహదారిని తాండూరు వరకు విస్తరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

డిప్యూటీ సీఎంను కోరిన ఎస్టీఎఫ్‌ సభ్యులు

చేవెళ్ల/మొయినాబాద్‌: ఉపాధ్యాయుల సమస్యల ను వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఎస్టీఎఫ్‌ నా యకులు విన్నవించారు. మంగళవా రం వారు సెక్రెటేరియట్‌లో భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు యు.పోచయ్య, ప్రధాన కార్యదర్శి డి.సైదులు, జిల్లా అధ్యక్షుడు జనార్దనాచారి, ప్రధాన కార్యదర్శి గోపాల్‌, చేవెళ్ల మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శులు రాంచంద్రయ్య, రమేశ్‌, సుధాకర్‌, శ్రీనివాస్‌, సంతోశ్‌, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

### క్రీడా స్ఫూర్తితో సాగాలి

విజిలెన్స్‌ సీఐ చరమందరాజు

ఆమనగల్లు: యువత క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని విజిలెన్స్‌ సీఐ గజ్జె చరమందరాజు అన్నారు. ఆమనగల్లు ప్రీమియర్‌ లీగ్‌ పేరుతో పట్టణంలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్‌ పోటీలు మంగళవారం ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. డ్రగ్స్‌, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు పిలుపునిచ్చారు. మొదటి బహుమతి సాధించిన జీకే వారియర్స్‌ జట్టుకు షీల్డ్‌తో పాటు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాపిశెట్టి రాము, గుమ్మకొండ రాజు, కృష్ణనాయక్‌ పాల్గొన్నారు.

# పండగ పూట దొంగల చేతివాటం

- తాళాలు వేసిన ఆరు ఇళ్లల్లో చోరీ
- వెండి ఆభరణాలు, నగదు మాయం

తాండూరు టౌన్‌: పండుగ పూట దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. తాళాలు వేసి సొంతూళ్లకు వెళ్లిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడ్డారు. పట్టణంలోని గ్రీన్‌సిటీ కాలనీలో సోమవారం రాత్రి ఆరు ఇళ్లలో దొంగతనం జరిగినట్లు తెలుస్తోంది. ఎస్‌ఐ రవూఫ్‌ తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం ఏలూరు చెందిన వెన్నంరెడ్డి రాఘవ గ్రీన్‌ సిటీ కాలనీలో ఉంటూ స్థానిక శాంతమహల్‌, శ్రీలక్ష్మి మహల్‌ థియేటర్లలో మేనేజర్‌గా పని చేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామానికి వెళ్లాడు. మంగళవారం ఇంటి తాళాలు పగులగొట్టినట్లు గుర్తించిన స్థానికులు ఆయనకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఇదే విషయం రాఘవ పోలీసులకు చెప్పడంతో వారు ఘటనాస్థలికి చేరకుని పరిశీలించారు. ఇంట్లో ఉన్న అరకిలో వెండి, రూ.18వేల నగదు చోరీకి గురైనట్లు నిర్ధారించారు. అదే కాలనీకి చెందిన మరో వ్యక్తి శ్రీనివాస్‌ గౌడ్‌ ఇంట్లో రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వీరితో పాటు మరో నాలుగు ఇళ్లల్లో దొంగలు చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. మిగిలిన ఇళ్ల యజమానులు అందుబాటులో లేరని ఎస్‌ఐ వెల్లడించారు.

# ఆర్థిక ఇబ్బందులతో గృహిణి బలవన్మరణం

అత్తాపూర్‌: కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఓ గృహిణీ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అత్తాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ పులి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్‌ సులేమాన్‌నగర్‌ ప్రాంతానికి చెందిన రీనా బేగం (26), షేక్‌ అబ్దుల్లాలు దంపతులు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం ఉన్నారు. షేక్‌ అబ్దుల్లా ఫర్నీచర్‌ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా గత కొన్నేళ్లుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతుండటంతో రెండేళ్ల నుంచి రీనా బేగం తల్లిగారింట్లోనే ఉంటుంది. కాగా ఇటీవలే రీనా బేగం తిరిగి అత్తాగారింటికి వచ్చింది. ఇంట్లో నెలకొన్న ఆర్థిక పరిస్థితులకు తోడు మద్యం సేవించిన భర్త అబ్దుల్లాతో ఇంట్లో మరోసారి గొడవ జరగడంతో తీవ్ర మనస్థాపానికి గురైన రీనా బేగం ఇంట్లో సీలింగ్‌ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# కిరాతకం

- భార్యను హతమార్చి తల, మొండెం వేరు చేసిన భర్త
- అనుమానం, కుటుంబ కలహాలతో దురాగతం
- అబ్దుల్లాపూర్‌మెట్‌ ‘జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం’లో ఘటన
- రెండు నెలల నుంచి విడిగా ఉంటున్న దంపతులు



పుష్పవతి (ఫైల్‌), హంతకుడు విజయ్‌(ఫైల్‌)

అబ్దుల్లాపూర్‌మెట్‌: అనుమానంతో పాటు కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన భార్యను అతి కిరాతకంగా హత్యచేశాడు. తల, మొండెం వేరు చేశాడు. ఈ దుర్ఘటన అబ్దుల్లాపూర్‌మెట్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్‌కు చెందిన విజయ్‌కుమార్‌, పుష్పవతి (41) దంపతులు. వీరి మధ్య గత కొంతకాలంగా మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. దీంతో రెండు నెలల క్రితం పుష్పవతి తన కూతురుతో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్‌లోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ 5/13 బ్లాక్‌లో నివాసముంటోంది. తన కుమారుడు, తల్లిదండ్రులతో కలిసి ఎల్బీనగర్‌లో ఉంటున్న విజయ్‌కుమార్‌ అప్పుడప్పుడు భార్య, కూతురు వద్దకు వస్తుండేవాడు. ఈ క్రమంలో జేఎన్‌యూఆర్‌ కాలనీకి ఆనుకుని.. ప్రభుత్వం నిర్మించిన నూతన భవన సముదాయంలోని 66/7 బ్లాక్‌లో తన సోదరికి ఇల్లు వచ్చిందని భార్యకు చెప్పాడు. ఆ ఇంటిని శుభ్రం చేసి వద్దామంటూ మంగళవారం పుష్పవతి వద్దకు చేరుకున్నాడు. అక్కడికి తీసుకెళ్లిన తర్వాత ముందస్తు పథకం ప్రకారమే వెంట తెచ్చుకున్న పదునైన కత్తితో పొడిచి హత్య చేశాడు. అంతటితో ఆగకుండా తల, మొండెం వేరుచేసి పరారయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్‌ సీఐ మన్మోహన్‌, ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం బాడీని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా.. మధ్యాహ్నం 2.30గంటలకు సంఘటన జరిగిన వెంటనే పురాణాపూల్‌లో ఉండే పుష్పవతి తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం ఇవ్వగా.. రాత్రి వరకు కూడా రాలేదు. దీంతో మృతురాలికి తన తల్లిదండ్రులతో సత్సంబంధాలు లేనట్లుందని పోలీసులు పేర్కొన్నారు. విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.


# కోడి పందేల నిర్వాహకులు అరెస్ట్‌


పోలీసుల అదుపులో పందేల నిర్వాహకులు

యాలాల: కాగ్నా నది ఒడ్డుక కోడి పందేలు నిర్వహిస్తున్న తొమ్మిది మంది నిర్వాహకులను టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. టాస్క్‌ఫోర్స్‌ ఎస్‌ఐ ప్రశాంత్‌ వర్ధన్‌ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని బెన్నూరు సమీపంలో కాగ్నానది పంప్‌ హౌస్‌ సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వారు యాలాల ఏఎస్‌ఐ యాదయ్య, సిబ్బందితో కలిసి పంప్‌ హౌస్‌ వద్ద దాడులు చేశారు. ఈ దాడుల్లో పందేలు నిర్వహిస్తున్న తొమ్మిది మందితో పాటుగా రెండు కోళ్లు, రూ.16,730 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసున్నామని.. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

# గోనె సంచిలో వ్యక్తి మృతదేహం

- కాళ్లు, చేతులు కట్టేసి, మూతికి ప్లాస్టర్‌ వేసిన హంతకులు
- ఓఆర్‌ఆర్‌ సర్వీస్‌ రోడ్డు పక్కన మృతదేహం
- పోలీసులకు సమాచారం అందించిన మున్సిపల్‌ సిబ్బంది
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసు ఉన్నతాధికారులు


మృతుడి మెడలో లభించిన చైన్‌

ఇబ్రహీంపట్నం: ఓ వ్యక్తిని అత్యంత కిరాతంగా హత్య చేసి, గోనె సంచిలో కుక్కి.. ఓఆర్‌ఆర్‌ సర్వీస్‌ రోడ్డు పక్కన పడేశారు. ఈ ఘటన మంగళవారం ఆదిబట్ల పీఎస్‌ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అనుమానాస్పదంగా ఉన్న గోనె సంచి నుంచి దుర్వాసన రావడాన్ని గమనించిన మున్సిపల్‌ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని బస్తాను విప్పి చూశారు. దాదాపు 35 ఏళ్ల వయస్సున్న ఓ వ్యక్తి కాళ్లు, చేతులు కట్టేసి, మూతికి ప్లాస్టర్‌ వేసిన శవం కనిపించింది. మృతుడి శరీరంపై నలుపు రంగు షార్ట్‌, టీషర్ట్‌ ఉన్నట్లు గుర్తించారు. మెడలో బంగారు చైన్‌, కుడికాలుకు నలుపు దారం, కుడి చేతికి కడియం ధరించి ఉన్నాడు. మృతుడి వయస్సు 35 ఏళ్లకు పైబడి ఉంటుందని.. ఎక్కడో హత్య చేసి ఇక్కడ పడేసినట్లు భావిస్తున్నామని చెప్పారు. సంఘటన స్థలాన్ని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురికీ తరలించారు.

# బెదిరించి డబ్బులు లాక్కున్న నలుగురికి రిమాండ్‌

అబ్దుల్లాపూర్‌మెట్‌: ద్విచక్ర వాహనాలపై వెళ్తు న్న వ్యక్తులను అడ్డగించి, డబ్బులు లాక్కుంటున్న నలుగురు సభ్యులున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేటలో నివాసం ఉండే సావల్‌రాం అనే వ్యక్తి ఔటర్‌ సమీపంలోని తన పాన్‌ షాప్‌ను బంద్‌ చేసి.. ఈ నెల 13న రాత్రి 11గంటల సమయంలో ఇంటికి వెళ్తున్నాడు. తారా కన్వెన్షన్‌ వద్దకు చేరుకోగానే నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించారు. అతన్ని బెదిరించి రూ.8 వేలు లాక్కుని పారిపోయా రు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను పట్టుకున్నారు. వీరిలో పెద్దఅంబర్‌పేట కళానగర్‌కు చెందిన ఆలేటి దుర్గాప్రసాద్‌, సిరిగిరి మధు, గగనం రవీందర్‌, మోతె శ్రీనివాస్‌ ఉన్నట్లు గుర్తించి, న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. అనంతరం నలుగురిని రిమాండ్‌కు తరలించారు.